2వ పాఠం అక్టోబరు 2-8

# మోషే యొక్క చరిత్రకు సంబంధించిన పాఠము

సబ్బాతు మధ్యాహ్నము అక్టోబరు 2

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : ద్వితియో 1-3; నిర్గమ 32:29-32; సంఖ్యా 14; ఎఫెసి 3:10; ఆది 15:1-16; యోహా 14:9.**

**కంఠతవచనం : "అందరును మోషేను బట్టి మేఘములోను సముద్రములోను బాప్తిస్మము పొందిరి. అందరు ఆత్మసంబంధమైన ఒకే ఆహారమును భుజించిరి. అందరు ఆత్మ సంబంధమైన ఒకే పానీయమును పానము చేసిరి. ఏలయనగా తమ్మును వెంబడించిన ఆత్మసంబంధమైన బండలోనిది త్రాగిరి. ఆ బండ క్రీస్తే" (1కొరింథి 10:3,4).**

మోషే ఇశ్రాయేలీయులందరితో చెప్పిన మాటలు ఇవే (ద్వితి 1:1) అవే మాటలతో ద్వితియోపదేశ కాండము ఆరంభమైంది. అవును ఈ పుస్తకము మోషే మాటలతో ఆరంభమై మోయాబు దేశములో అతడు మరణించు వరకు (ద్వితి 34:5). ఆయన యొక్క ఉనికిని గూర్చి నాయకుడుగా అతడందించిన సేవలకు సంబంధించిన ప్రధానమైన విషయాలతో నిండియున్నది. బైబిలంతయు ప్రభువైన యేసును గూర్చే వ్రాయబడినట్లుగానే ద్వితియోపదేశకాండము కూడా యేసును గూర్చే చర్చించింది. యేసే మనలను సృష్టించినవాడు (ఆది 1,2; యోహా. 1:1-3) ఆయనే మనలను సహించువాడు (కొలస్సి 1:15-1; హెబ్రీ 1:3) మరియు మనలను విమోచించువాడు (యెషయా 41:14; తీతుకు 2:14)నై యున్నాడు. రక్షణ చరిత్రలో ఒక ప్రధానమైన సమయాన తన ప్రజలను ఏవిధముగా సృష్టిస్తూ, వారిని సహించుచూ, విమోచించాడో అనే విషయాలను ద్వితియోపదేశకాండము బయలుపర్చుచున్నది.

అంతిమముగా ఇశ్రాయేలీయుల పిల్లలు కానాను దేశములో ప్రవేశించు సమయాన మోషే వారికి చరిత్రలోని ఒక పాఠమును వారి దృష్టికి తీసుకొని వచ్చి బైబిలంతటిలోను ప్రముఖముగా చెప్పబడిన విషయాన్ని అనగా గతించిన కాలములో ప్రభువు నీ యెడల చేసిన కార్యములను జ్ఞాపకముంచుకోమని వారికి చెప్పెను.

ఆనాడు వారికి దేవుడిచ్చిన హెచ్చరికే నేడు మనకు కూడా వర్తిస్తుంది. నేడు మనము ఇంకా మేలైన వాగ్దాన భూమిలోనికి ప్రవేశించబోవుచున్నాము. "మన గత చరిత్రను ఒకసారి సమీక్షించుకున్నట్లయితే మనము ప్రయాణించిన ప్రతి అడుగులోను మన నాయకుడైన క్రీస్తు యొక్క నడిపింపు మరియు కాపుదల ఉన్నట్లు గ్రహించగలము. నేడు మనమున్న ఈ స్థితి గత కాలములో మన యెడల ఆయన చేసిన వాగ్దానము యొక్క నెరవేర్పునకు సూచనయైయున్నది. మనము ఆయన ఇచ్చిన ఉపదేశములను, చేసిన ఉపకారములను

మర్చిపోతే తప్ప మన భవిష్యత్తును గూర్చి భయపడవలసిన అవసరము లేదు" –ఎలెన్ జి వైట్, జీవిత నమూనాలు, పుట 196.

అక్టోబరు 9 సబ్బాతు దినమున ఈ పాఠమును అధ్యయనము చేయుటకు సిద్ధపడుడి.

**ఆదివారం** **అక్టోబరు 3**

## మోషే యొక్క పరిచర్య

బైబిలంతటిలోను మోషే యొక్క ఉనికిని గూర్చి తెలుసుకొనగలము. ఆయనను గూర్చి నిర్గమ 2:2లో ప్రథమముగా పేర్కొనబడినప్పటికి దానికిముందే మనము ఎవరమైయున్నాము, ఇక్కడకు ఏవిధముగా వచ్చాము. ఇప్పుడున్నట్లు ఈ లోకములోని విషయాలు చెడుగా ఉన్నా మంచి కొరకు ఎందుకు నిరీక్షిస్తున్నాము అనే కొన్ని మౌలిక విషయాలతో పాటు దేవుని యొక్క అధికారమును వివరించే బైబిలులోని ప్రథమ పుస్తకమైన ఆదికాండము ఆయనే వ్రాసాడు. సృష్టిని గూర్చి, మానవుని పతనము, విమోచనకు సంబంధించిన వాగ్దానము, జలప్రళయము, అబ్రహాము, సువార్త వీటన్నిటి యొక్క మూలములు ప్రవక్తయైన మోషే వ్రాసిన ఆదికాండములో ఉన్నవి. అరుదుగా పొరపాట్లు చేసినప్పటికి మోషే యెహోవాను ప్రేమించి ఆయనకు సేవ చేయాలనే ప్రగాఢమైన కోరిక కలిగినవాడు కాబట్టి అప్పటి పరిస్థితులను ఎంత వరకు ప్రభావితం చేయగలిగాడో పరిపూర్ణంగా కొలత వేయుట సాధ్యమయ్యే పని కాదు.

**నిర్గమ 32:29–32 చదువుడి. ఇశ్రాయేలు ప్రజలు బంగారు దూడ విగ్రహమును తయారు చేసుకొనుట ద్వారా గొప్ప పాపమును గూర్చి యెహోవాకును మరియు మోషేకును మధ్య జరిగిన సంభాషణను ఈ వాక్యములు వివరిస్తున్నవి. మోషే యొక్క ప్రవర్తనలో కొన్ని పొరపాట్లున్నా, ఆయనను ఎంతో ఘనముగా దేవుడు వాడుకొనుట ద్వారా అతని స్వభావమును గూర్చి ఈ వాక్యములు మనకు ఏమి బోధించుచున్నవి?**

ఆ సమయములో అక్కడ జరిగిన పాపము విషయములో మోషేకు ఎటువంటి పాత్ర లేకపోయినను తన ప్రజలు చేసిన పాపము నిమిత్తమైన తన ప్రాణము పోయినా వారిని క్షమించమని వారి పక్షముగా యెహోవాను బ్రతిమాలెను. ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే నిర్గమ 32:32లో మోషే చేసిన ప్రార్థనలో వాడిన క్రియాపదమును బట్టి వారి పాపమును దేవునినే భరించమని ప్రాధేయపడినట్లు అర్థమగుచున్నది. చివరికి వారి పాపములైనా, మన పాపములైనా, ఆ రీతిగానే, క్షమించబడవలసియుందనే భావమును మోషే వ్యక్తపర్చెను. ఆ విధముగా బైబిలు యొక్క ఆరంభములోనే మనకు బదులుగా దేవుని కట్టడలను ధర్మశాస్త్రమును అనుసరించి జీవించే మానవ జాతి యొక్క పాపములకు శిక్షను యేసు భరించనైయున్నాడనే రక్షణ ప్రణాళికను ఒక శక్తివంతమైన రీతిలో తెలియపర్చబడెను.

అదే విషయాన్ని అనేక శతాబ్దముల తరువాత యేసును గూర్చి పేతురు ఈ విధముగా వ్రాస్తున్నాడు. "మనము పాపముల విషయమై చనిపోయి నీతి విషయమై జీవించునట్లు, ఆయన తానే తన శరీరమందు మన పాపములను మ్రాను మీద మోసికొనెను. ఆయన

పొందిన గాయములచేత మీరు స్వస్థత నొందిరి". (1పేతురు 2:24). అదే సందర్భములో పాపములో పడిపోయిన మానవాళి కొరకు రానైయున్న యేసునకు సూచనగా, మోషే తన ప్రజలకు విజ్ఞాపన పరిచర్య చేసెను (హెబ్రీ 7:25).

**తన ప్రజల కొరకు తన ప్రాణము పోగొట్టుకొనుటకైనను అంగీకరించెనా? ఈ మాటలలో దాగియున్న అంతర్భావమును గూర్చి ఆలోచించండి. దాని ద్వారా ఇతరులను ప్రేమించుట ఎంత అవసరమో అర్థము చేసుకొనగలరా?**

## సోమవారం అక్టోబరు 4

## నెరవేరిన ప్రవచనము

నవీన విజ్ఞానశాస్త్రము కొన్ని తప్పులను నిజమని ప్రకటించుచున్నను (ఉదా: శూన్యములో నుండి విశ్వము దానంతట అదే ఉనికిలోనికి వచ్చెననియు, కొన్ని సామాన్యమైన రసాయనిక పదార్థముల తోడ్పాటుతో భూమి మీద జీవము ఆకస్మికముగా ఉద్భవించినది మరియు కొన్ని ఆశ్చర్యకరమైన విషయాలను కూడా విజ్ఞాన శాస్త్రము వివరించుచున్నది. పతనమైన స్థితిలో కూడా ప్రకృతి ప్రపంచములో ఉన్న సామరస్యం, సమతౌల్యం ఖచ్చితత్వం మొదలైన విషయాలను బట్టి విజ్ఞానశాస్త్రమును పఠించేవారు మిక్కిలి ఆశ్చర్యపడుచున్నారు.

దేవుడు భౌతిక విషయాలలోనే అంత ఖచ్చితముగా ఉన్నప్పుడు తప్పనిసరిగా ఆధ్యాత్మిక విషయాలలో కూడా అంతే ఖచ్చితముగా ఉంటాడనుటలో సందేహములేదు. అందుచేతనే ద్వితియోపదేశకాండము యొక్క ఆరంభ వాక్యాలలో దేవుని యొక్క ఖచ్చితత్వమును మనము చూడగలము.

**ద్వితియో 1:1-5 చదువుడి. 1:4లో పేర్కొనబడిన 40 సంవత్సరము ఏవిధముగా ప్రవచనము రీత్యా అర్థము కలిగియున్నది?**

దేవుడు వాగ్దానము చేసిన ఆ దేశమును చూచుటకు వేగులవారిని మోషే కాదేషు బర్నేయ నుండి పంపినప్పుడు, వారు తిరిగి వచ్చి యిచ్చిన సమాచారమును బట్టి ఇశ్రాయేలు ప్రజలు ఆ దేశములోనికి వెళ్ళుటకు తిరస్కరించిన తరువాత ఏమి జరిగింది? వారు కోరుకొనిన వాగ్దాన భూమిలోనికి వారు ప్రవేశించారు అని తెలియపర్చడమైనది. ఎంత కాలము వరకు వారు ఆ వాగ్దాన భూమిలోనికి ప్రవేశించలేదు? అనే ప్రశ్నకు జవాబుగా "మీరు ఆ దేశమును సంచరించి చూచిన నలుబది దినముల లెక్క ప్రకారము దినమునకు ఒక సంవత్సరము చొప్పున నలుబది సంవత్సరములు మీ దోష శిక్షను భరించి నేను మిమ్మును త్రోసి వేసినట్టు తెలిసికొందురు" (సంఖ్యా 14:34) అని చెప్పెను.

అందుచేత దేవుడు చెప్పినట్టు ఖచ్చితముగా "నలుబదియవ సంవత్సరము"ను ద్వితియోపదేశకాండము పేర్కొనియున్నది. దేవుడు ఎంత విశ్వసనీయమైనవాడో ఆయన ప్రవచన వాక్యము కూడా అంతే విశ్వసనీయమైనదని ద్వితియోపదేశకాండములోని ఆరంభ వాక్యాలలో నిరూపించబడినది. అనగా దేవుడు ఏమి చెప్పాడో దానిని ఆయన తప్పనిసరిగా చేస్తాడనియు మరియు ఆయన ఎప్పుడు చేస్తానని చెప్పాడో అపుడే దానిని చేస్తాడని ద్వితియో

పదేశకాండములోని మొదటి వాక్యములను బట్టి గ్రహించగలము.

దేవుడు చెప్పినట్టు ఈ ఒక్క ప్రవచన కాలమే నెరవేరియుందని అపోహ చెందనవసరము లేదు. గతించిన కాలములోనికి చూచిన యెడల దానియేలు 9:24–27లో యేసుకు సంబంధించిన కాలపరిమితిని గూర్చి యెహోవా దేవుడు చెప్పినట్లుగా అక్షరాలా నెరవేరినది. చరిత్రలో "ఒక కాలము, కాలములు, అర్ధకాలము" (దాని 7:25; మరియు ప్రక. 12:6,14; 13:5 కూడా చూడుడి) అనే ప్రవచనము మరియు దాని 8:14లోని 2,300 దినముల ప్రవచనము నెరవేరియున్నట్లు చూడగలము.

ఖచ్చితమైన కాలమునకు సంబంధించిన ప్రవచనములతో పాటు దానియేలు 2,7,8 అధ్యాయాలలో ఉన్న ప్రపంచ చరిత్రకు సంబంధించిన రాజ్యములు రాబోవునని ముందుగా చెప్పబడిన విషయాలు కూడా ఖచ్చితముగా నెరవేరియున్నవి. వీటన్నిటిని బట్టి దేవునికున్న విశ్వసనీయతతోపాటు, ఆయనకు భవిష్యత్ జ్ఞానము మరియు అన్నియు వశమైయున్నవని గ్రహించగలము.

**ముందుగా చెప్పినట్లే చాలా నమ్మకముగా ప్రతి విషయమును దేవుడు నెరవేర్చియున్నాడు. నెరవేరియున్న విషయాలను ఆధారము చేసుకొని, ఆయన త్వరలో రానైయున్నాడనే భవిష్యత్తుకు సంబంధించిన విషయాన్ని మనము ఎందుకు నమ్మవలసియున్నాము?**

## మంగళవారం అక్టోబరు 5

## ఒక వేయి రెట్లకు మించి ఆశీర్వదించు

అరణ్యములో అక్కడక్కడ మజిలీ చేయుచు చాలా కష్టమైన ప్రయాణమును సాగించిన తరువాత దేవుని పక్షమున మోషే మాట్లాడుచు (మోషే ప్రవక్త ఒక విధముగా ప్రవక్త కన్నా ఎక్కువవాడే) ఈ విధముగా పలికెను.

"ఇదిగో ఆ దేశమును మీకు అప్పగించితిని. మీరు వెళ్ళి యెహోవా మీ పితరులైన అబ్రహాము, ఇస్సాకు, యాకోబులకును వారి తరువాత వారి సంతానమునకును ఇచ్చెదనని నేను ప్రమాణము చేసిన దేశమును స్వాధీపరచుకొనుడి" (ద్వితియో 1:8). అటు తరువాత ఏమి సంభవించినది?

**ద్వితియో 1:9–11 చదువుడి. కాదేషు బర్నేయ యొద్ద ప్రజలు చేసిన తిరుగుబాటును దృష్టిలో పెట్టుకొని చూచిన యెడల ఈ వాక్యముల యొక్క ప్రాధాన్యత ఏమిటి?**

ఇక్కడ దేవుని యొక్క అనుగ్రహము వారికి ఏవిధముగా చూపించబడెనో ఒక ఉదాహరణను చూడగలము. అరణ్యములో వారు సంచారము చేయుచున్నను వారు ఆశీర్వదింపబడియున్నారు. "నిజముగా అరణ్యములో ఏమియు తక్కువ కాకుండా నలువది సంవత్సరములు వారిని పోషించితివి. వారి వస్త్రములు పాతగిలిపోలేదు. వారి కాళ్ళకు వాపురాలేదు" (నెహెమ్యా 9:21).

దేవుడు వారిని ఆశీర్వదించిన దానికి మించి ఒక వేయి రెట్లు వారిని ఆశీర్వదించమని

మోషే తన ప్రజలనిమిత్తము దేవునిని వేడుకొనెను. ఆవిధముగా మోషే తన ప్రేమను ప్రజల యెడల చూపించెను.

**ద్వితియో 1:12–17 చదువుడి. దేవుని యొక్క దీవెనలు వారికి అనుగ్రహింపబడగా ఆ పరిస్థితిలో మోషే ఏవిధముగా వ్యవహరించెను?**

దేవుడు వారి మధ్యన ఉన్నప్పటికి వారి మధ్య జవాబుదారీతనమును నెలకొల్పుటకు వీలుగా ఒక వ్యవహార నిర్వహణ సంస్థను ఏర్పాటు చేయుట జరిగింది. ఇశ్రాయేలు ఒక క్వహల్ అనగా క్రమపర్చబడిన సమాజముగా ఏర్పడినది (ద్వితియో 31:30) చూడుడి). అది నూతన నిబంధనలోని ఇక్లేశియా అనగా గ్రీకు భాషలో “చర్చి” సంఘము (మత్త 16:18)గా ఏర్పడుటకు అది రాబోవు దానికి సూచనగా ముందే నియమింపబడెను. పౌలు వేరొక పరిస్థితులలో పనిచేయుచున్నను, అతని యొక్క యూదయ మూలములను మరచిపోకుండా, ఆయన ఏర్పాటు చేసిన సంఘము లేక సమాజములో సమర్థత లేక యోగ్యతకల వారికి వివిధ బాధ్యతలను అప్పగించుట ద్వారా నైపుణ్యముతో పరిచర్య జరుగునట్లు అరణ్యములోని క్వహల్ (ద్వితియో) మాదిరిని అనుసరించెను (1కొరింథి 12 చూడుడి). నాడు అరణ్యములో క్వహల్ వలె నేడు క్రైస్తవ సంఘము అందరూ కలిసి ఒకటిగా పనిచేయవలసిన వ్యవస్థయైయున్నది. ఏకీకరణ చేయబడిన సంఘము అనే వ్యవస్థలో ఎవరి వరమును బట్టి వారు వారికివ్వబడిన బాధ్యతను నెరవేర్చాలి.

కొన్ని సందర్భాల్లో “క్రమపర్చబడిన” మత వ్యవస్థలో దాని నిర్వహణ విషయములోను లేక వేరే విషయాలలోను వ్యతిరేకించేవారు ఉండవచ్చును. కాని క్రమపర్చబడిన సంఘముగా ఉండవలసిన చోట క్రమమును చెడగొట్టుట ఎట్టి పరిస్థితిలోను ఉండకూదు. ముఖ్యముగా నూతన నిబంధన సంఘములో క్రమమునకు వ్యతిరేకతను దేవుని వాక్యము కూడా అంగీకరించుట లేదు.

**బుధవారం** **అక్టోబరు 6**

## కాదేషు బర్నేయ

ద్వితియోపదేశకాండము మొదటి భాగములలో కాదేషు బర్నేయకు సంబంధించిన భయాందోళన వెంటాడుతూ ఉన్నట్లు కనిపిస్తున్నది. మనము చూచిన విధముగా ఈ విచారకరమైన వృత్తాంతము ద్వితియోపదేశ కాండము యొక్క విషయమునకు తగిన నేపథ్యమును కల్పించెను. అందుచేత దీనిని లోతుగా అధ్యయనము చేయవలసిన అవసరమెంతైనా ఉంది.

**సంఖ్యా కాండము 14 చదువుడి. వేగులవారు యిచ్చిన సమాచారమునకు ప్రజలు ఏవిధంగా స్పందించారు? మరియు దాని వలన ఎదురైన పర్యవసానలేమిటి? (ద్వితియో 1:20–46 కూడా చూడుడి).**

ఈ వృత్తాంతము ద్వారా ప్రాముఖ్యమైన అనేక పాఠములను నేర్చుకొనవచ్చును. వాటిలో ఒక దానిని గూర్చి సంఖ్యాకాండము 14లో చూడగలము.

**సంఖ్యాకాండము 14:11-20 చదువుడి. ఇక్కడ మోషే మరొకసారి మధ్యవర్తిత్వము జరిపేవానిగా కనిపించినప్పటికి దేవుడు ఆ జనులను నాశనము చేయ ఉద్దేశించినపుడు ఆయనను గూర్చి మోషే వివరించిన యదార్థ విషయాలయొక్క ప్రాధాన్యత ఏమిటి?**

దేవునితో మోషే ఏమి మాట్లాడుచున్నాడో ఆలోచించుడి. ఈ జనులను ఇక్కడే చంపివేసినచో ఐగుప్తీయుల దృష్టిలోను మరియు ఈ ప్రాంతములో ఉన్న ఇతర జనులు (దేవునిగూర్చి) ఏమనుకుంటారో ఆలోచించమని మోషే ప్రాధేయపడ్డాడు. ఇశ్రాయేలీయుల యెడల దేవుడు చేయనుద్దేశించినది కేవలం వారికి మాత్రమే గాక మానవజాతియంతటికి వర్తించే విషయమనియు, ఇశ్రాయేలీయులు లోకమునకు వెలుగుగాను, దేవుని యొక్క ప్రేమను గూర్చి మరియు దేవుని రక్షణ ప్రణాళికను ఆ పురాతన జనులకు సాక్ష్యమిచ్చే వారిగాను ఎన్నికచేయబడినవారు కాబట్టి వారిని క్షమించమని మోషే వేడుకొనెను.

మోషే ఇంకా మాట్లాడుచూ, ఓ దేవా నీవు ఇశ్రాయేలీయులను ఇక్కడ నాశనము చేసినచో నిన్ను గూర్చి ఇతర దేశస్తులు ఈ విధముగా అనుకుంటారని చెప్పెను. "ప్రమాణపూర్వకముగా తాను ఈ జనులకిచ్చిన దేశమందు వారిని చేర్చుటకు శక్తిలేక యెహోవా వారిని అరణ్యములో సంహరించెనని చెప్పుకొందురు" (సంఖ్యా 14:16). తన ప్రజల మధ్యన దేవుడు మహిమపర్చబడాలననది మోషే యొక్క భావములోని సారాంశమైయున్నది.

**ఎఫెసి 3:10 చదువుడి. ఇక్కడ పౌలు ఏమి చెప్పుచున్నాడు? అది ఏవిధముగా సంభవిస్తుంది? దేవుని యొక్క "నానావిధమైన జ్ఞానము విశ్వమంతటికి ఏవిధముగా తెలియజేయబడినది? వ్యక్తిగతముగా నా యొక్క విధి ఏమైయున్నది?**

గురువారం **అక్టోబరు 7**

## అమోరీయుల అక్రమము

ఇశ్రాయేలీయులు దేవునియందు విశ్వాసము కలిగియున్నపుడు బలవంతులు మరియు ఉన్నత దేహులైన వారి శత్రువులను సమూలముగా నాశనము చేసిన వారి చరిత్రను ద్వితియో 2 మరియు 3లో మోషే మరొకసారి వివరిస్తున్నాడు (ద్వితియో 2:11, 20; 3:13).

ఇక్కడ ఇశ్రాయేలీయులు వారు చేసిన నాశనమును గూర్చి ఒకసారి ఆలోచించవలసియున్నది. ఇశ్రాయేలీయులు తరచుగా ఇతర దేశస్తులతో ముందుగా శాంతినే కోరుకుంటారు. (ద్వితియో 20:10, 11) అయినప్పటికి వారి శత్రు దేశములతో చేసుకొనిన ఒప్పందములను గౌరవించకపోయినప్పుడు అనేక సందర్భాలలో స్త్రీలను మరియు పిల్లలతో సహా వారిని నాశనము చేసినట్లుగా చూస్తున్నాము. "మన దేవుడైన యెహోవా అతనిని మనకు అప్పగించెను గనుక మనము అతనిని అతని కుమారులను అతని సమస్త జనమును హతము చేసి ఆ కాలమున అతని సమస్తపురములను పట్టుకొని ప్రతి పురమును అందలి స్త్రీ పురుషులను, పిల్లలను శేషమేమియు లేకుండ నాశనము చేసితిమి" (ద్వితియో 2:33,34).

కొంతమంది ఈ వృత్తాంతాలు వాస్తవములు కాదనే వారు కూడా ఉన్నారు. అయితే "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి" (2తిమోతి 3:16) అని మనము నమ్ముచున్నాము కాబట్టి సెవెంతు డె ఎడ్వంటిస్టు సభ్యులముగా మనకు ఎటువంటి అనుమానము వాటి విషయములో ఉండనవసరము లేదు.

**ఆది 15:1-16 చదువుడి. ఈ జటిలమైన అంశమును మనము అర్థము చేసుకొనుటకు వీలుగా ఆది 15:16లో దేవుడు అబ్రహాముతో ఏమి చెప్పెనో చర్చించుడి.**

విగ్రహారాధికులైన అన్యదేశస్తులు మితిమీరిన క్రూరత్వము మరియు నిర్దయగా శత్రువుల యెడల ప్రవర్తించేవారు గనుక అటువంటి వారికి మార్పు చెందుటకు దేవుడు ఒక అవకాశము యిచ్చినను వారు మార్పు చెందే జనులు కానందున వారికి అటువంటి శిక్షను దేవుడే నియమించెను అనుటలో సందేహము అవసరములేదు. (ఉదా: ఇశ్రాయేలీయులు యుద్ధాలలో చంపిన స్త్రీలు మరియు పిల్లలు కన్నా జలప్రళయ సమయంలో మరణించిన స్త్రీలు మరియు పిల్లలు అధిక సంఖ్యలో ఉండి ఉంటారు).

ఇక్కడ పొందుపరచబడిన సమాచారము మరియు సందర్భమును బట్టి ఈ ఘోరమైన వాస్తవమును మనము అంగీకరించుటయే గాక, అనేక విధాలుగా దేవుడు బయలుపర్చిన తన మంచితనమునందు మన నమ్మకమును పెట్టుకొనుట ఎంతైన అవసరమున్నది. మనకు ఆహ్లాదకరముగా ఉండే విషయాలను గూర్చి దేవుని యొక్క ప్రేమయందు మన విశ్వాసమును కనుపర్చుటయేగాక, మనము పరిపూర్ణముగా అర్థము చేసుకోలేనటువంటి కొన్ని విషయాలను గూర్చి ఆయన యందు నమ్మకము కలిగియుండుట కూడా మన విధియైయున్నది.

**1కొరింథి 10:1-4 మరియు యోహాను 14:9 చదువుడి. దేవునిని అర్థము చేసుకొనుటకు మనకు కష్టమైనపుడు ఆయన ప్రేమయందు, న్యాయమునందు మరియు మంచితనము నందు మన నమ్మకమును పెంచుకొనుటకు ఈ పై వాక్యములు మనకు ఎట్లు సహాయపడగలవు?**

**శుక్రవారం** **అక్టోబరు 8**

## అదనపు అధ్యయనము

కొన్ని శత్రు దేశముల యెడల ఇశ్రాయేలీయులు కఠినముగా వ్యవహరించిన తీరును బట్టి ఒక పండితుడు ఈ క్రింది విధముగా జవాబివ్వడానికి ప్రయత్నించాడు.

మానవులను మరియు సమస్తమును సృజించిన సృష్టికర్తయైన దేవుడు అన్నిటి మీద అధికారము కలిగినవాడు కాబట్టి దేవుడు ఏమి చేసినను అది ఆయన దృష్టిలో న్యాయమైనదిగానే ఉండును.

"దేవుని యొక్క మార్గములు మర్మముతో కూడుకొనినవైయుండును. ఆయనను మనము ఎన్నటికి పరిపూర్ణముగా అర్థము చేసుకొనలేము కాబట్టి మన మనసులలో ఉన్న కొన్ని ప్రశ్నలకు యెషయా 55:8,9 సంతృప్తికరమైన అవగాహనను కల్పించవచ్చును.

కనానీయులను గూర్చి బైబిలు ఈ విధముగా వర్ణించుచున్నది. వారు బహు మూర్ఖులు. వారు చేసిన పాపాలను బట్టి వారు సమూలముగా నాశనము చేయబడుట దేవుని యొక్క తీర్పుగా ఎంచబడును. అటువంటి నాశనము మొదటిసారి కాదు లేక అది అంతయు కూడా కాదు. కనానీయుల యొక్క వినాశనము మానవజాతి యొక్క వినాశనముగా సూచించబడుచున్నది. (నోవహు యొక్క కుటుంబము అందుకు మినహాయింపు).

"అన్యజనులను ఇశ్రాయేలీయులు సమూలనాశనము చేయాలనే విధానము ఎన్నడు దేవునిది కాదు. (ద్వితియో 7:1) నాశనము చేయబడవలసిన వారిని గూర్చి ప్రత్యేకముగా గుర్తించడం చూడగలము. ఇశ్రాయేలీయులు ఈ విధానమును అర్మేనీయుల యెడల ఏదోమీయుల యెడల లేక ఐగుప్తీయుల యెడల లేక ఇతరులందరియెడల అనుసరించకూడదని పై వాక్యములో చూడగలము" (ద్వితి 20:10-18).

"రక్షణ చరిత్రలో కనానీయుల సర్వనాశనము ఒక అవసరమైన మెట్టుయైయుంది".

"కనానీయుల యొక్క వినాశనము దేవుని యొక్క తీర్పుగా ఉన్నప్పటికి అది సంభవించుటకు వారికి 40 సం॥ల ముందుగానే హెచ్చరిక జారీ చేయబడెను (రాహబు యొక్క అపరాధాంగీకారము యెహోషువ 2:8-11లో చూడవచ్చును" -దానియేలు ఐబ్లాకు, ఎన్ఐవి కామెంటరీ, ద్వితి పుట 98, 99.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. వెయ్యేండ్ల పరిపాలన కాలములో మన ప్రశ్నలన్నింటికి జవాబులు దొరుకుతాయనే విషయాన్ని గూర్చి ఆలోచించండి. ఈ అవగాహన వలన మనము దేవునియందున్న నమ్మకమును ఏవిధంగా పెంచుకొనగలము?
2. భవిష్యత్తును గూర్చి దేవుని యెడల నీకు నమ్మకము కలుగుటకు గత కాలములో దేవుడు నీ యెడల చేసిన కార్యములు ఏవిధంగా సహాయపడును?
3. ఆదివారము పాఠము యొక్క చివరి భాగమును మీ తరగతిలో మరొకసారి అధ్యయనము చేయుడి. అక్కడ తన ప్రజల కొరకు మోషే తన ప్రాణమును పోగొట్టుకొనుటకు సహితము సిద్దపడిన విధానము ద్వారా విమోచన క్రయధనమును గూర్చి నీవెట్లు అర్ధము చేసుకున్నావు?

❋✶❋